నేడు ఎమ్మెల్యే పర్యటన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్ నగర్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 8.30 గంటలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహాబేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ పర్యటించనున్నారు. కార్యక్రమానికి బస్తీ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్లు, వార్డు మెంబర్లు, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పువ్వులనే దేవతగా పూజించే గొప్ప పర్వదినం బతుకమ్మ అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో జరుపుకునే గొప్ప పండుగ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో నాలా పక్కన ఉన్న ఒక ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఇంట్లోని వస్తువులు నాలాలో పడిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కార్మికులకు హెల్త్ కార్డుల పంపిణీ



ఆల్విన్‌కాలనీ: శ్రీభవానీ శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బాలప్ప ఆహ్వానం మేరకు పాపిరెడ్డినగర్ కంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం కార్మికులకు హెల్త్ కార్డులను అందజేశారు. కార్మిక జెండా ఎగురవేసి భవనాలను నిర్మించే సమయంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు నాగప్ప, ప్రధాన కార్యదర్శి, శ్రీను, డాకురి అక్కిరెడ్డి, మల్లేష్, గడ్డం సునీల్, నరసింహా, బుల్లెట్ రాజు, ఆగం రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శేఖర్‌యాదవ్, మల్లేష్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హస్మత్‌పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 90000 66337, 97016 12299.

అమ్మవారికి వెండి కిరీటం



మోతీనగర్: బోరబండ బస్టాప్‌లో శ్రీపోచమ్మ ఆలయంలో అమ్మవారికి స్థానికులైన ఏ.మహేష్ చంద్ర, హిమబిందు దంపతులు సుమారు అర కేజీ వెండితో తయారు చేసిన కిరీటాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

థర్మో కేబుల్ పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు

కుత్బుల్లాపూర్: కార్మికుల రిటైర్‌మెంట్ వయసు తగ్గిస్తూ పరిశ్రమ యాజమాన్యానికి లేబర్ జాయింట్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో థర్మో కేబుల్ కంపెనీ యాజమాన్యం కార్మికుల రిటైర్‌మెంట్‌ను 55 సంవత్సరాలకే కుదించింది. కార్మికులు పోరాడుతున్నా పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో కార్మిక నేత చింతల నాగరాజు ఈ విషయాన్ని జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆదివారం పరిశ్రమ హెచ్ఆర్ శ్రీకాంత్‌తో సమావేశమైన చింతల నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి యాజమాన్యంపై సీరియస్ అయ్యారు. 58 సంవత్సరాలు రిటైర్మెంట్ వయసును తప్పనిసరిగా అమలు చేయాలని, 55 సంవత్సరాలకు కుదించిన థర్మో కేబుల్ సంస్థ యాజమాన్యం ఇందుకు జవాబు ఇవ్వాల్సిందిగా లేబర్ జాయింట్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు.

ఆఫీసర్స్.. కేర్‌లెస్..

ఫ్లైఓవర్‌పై ప్రమాదకరంగా గుంతలు | ప్రాణాలుపోతేనే స్పందిస్తారా..? | ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

భరత్‌నగర్ ఫ్లై ఓవర్‌పై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భరత్‌నగర్ కాలనీ నుంచి ఎర్రగడ్డ వైపు వెళ్లే బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. గతంలో స్థానికులు స్పందించి గుంతల్లో మట్టి నింపారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆ మట్టి కొట్టుకుపోయింది. దీంతో మళ్లీ గుంతలు ఏర్పడి వాహనదారులు తిప్పలు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే గుంతలకు మరమ్మతులు చేయకపోవడం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. నిర్లక్ష్యంగా ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎర్రగడ్డ నుంచి భరత్‌నగర్ వెళ్లే రోడ్డుపై కూడా గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిపై కొన్నిచోట్ల ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – మూసాపేట


భరత్‌నగర్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు


భరత్‌నగర్ బ్రిడ్జిపై గుంతలు


తేలిన ఇనుప చువ్వలు

మలయాళీలకు అండగా ఉంటాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఓనం పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: ఓనం పండుగ సందర్భంగా మలయాళీలందరికీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు. నవోదయ మలయాళీ కల్చరల్ అసోసియేషన్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నైనా గార్డెన్స్‌లో నిర్వహించిన ఓనం పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లిలో సుమారు 40 ఏళ్ల క్రితమే మలయాళీలు నివాసం ఉండేవారని, వారు ఉండే ప్రాంతానికి కేరళ బస్తీ అనే పేరు వచ్చిందని తెలిపారు. కేరళ ప్రజలకు తెలంగాణ ప్రజలకు మధ్య ఎన్నో ఏళ్లుగా సోదరభావం కొనసాగుతోందని తెలిపారు. మలయాళీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు సురేంద్రన్, బాబు, మహిళలు, యువతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజయదశమి వేడుకలు


విజయదశమి వేడుకలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, స్వయం సేవకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీమాన్ కోసాల రామకృష్ణమాచార్యులు హాజరై ప్రసంగించారు. ప్రథమ వక్తగా మంగళంపల్లి శ్రీధర్ పాల్గొని విజయదశమి మహాత్యాన్ని వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ధ్వజ ప్రణామం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్ స్థాపకుడు డా.కేశవ్ బాలిరాం హెడ్గేవార్ 1925లో ప్రారంభించిన ఈ మహోన్నత సేవాయజ్ఞం ఈ రోజు 100 ఏళ్ల దిశగా అడుగులు వేస్తూ సమాజంలో జాతీయ అభిమానాన్ని పెంపొందిస్తూ, యువతను సన్మార్గంలో నడిపిస్తోందన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ బస్తీ స్వయం సేవకులు, ప్రాంతీయ నాయకులు, సాంఘిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా అన్నదానం


అన్నదానం కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్


హస్మత్‌పేట చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్య సందర్భంగా హస్మత్‌పేట నల్లపోచమ్మ దేవాలయం సమీపం లయన్స్ టౌన్ కాలనీలో అన్నదానం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, లీలా, ప్రకాశ్, మక్కాల మహేష్, శ్యాం, మోహన్, మణిరత్నం, రోబోట్ తదితరులు పాల్గొన్నారు.

అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హస్మత్‌పేట చౌరస్తాలో అమావాస్యను పురస్కరించుకొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముద్దం మల్లికార్జునయాదవ్, బుల్లెట్ రవి, ప్రకాశ్, బాలేశం, రాము, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

మోతీనగర్: అనాథలు, అభాగ్యులను ఆదుకుంటేనే జీవితానికి సంతృప్తి లభిస్తుందని బీఆర్ఎస్ బీసీ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర పేర్కొన్నారు. ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమ విద్యార్థులకు నూతన దుస్తులు, పండ్లను ఆదివారం పంపిణీ చేశారు. వి.రామారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజుచారి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్, నాయకులు సంజీవ పటేల్, బి.వెంకట యాదవ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు


మాట్లాడుతున్న చైర్మన్ బాకారం బుచ్చయ్య

మోతీనగర్: 22 నుంచి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బాకారం బుచ్చయ్య, ఆలయ కార్యనిర్వహణ అధికారి గుమ్మడిదల సుధాకర్ అన్నారు. మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పాలక కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. ఆలయంలో ప్రతి శనివారం శ్రీవారి కల్యాణం, గురువారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలక కమిటీ సభ్యులు జి.రామకృష్ణ, దూడల జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం




ఎల్ఓసీ అందజేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీకి చెందిన సత్తెనపల్లి షణ్ముఖచారి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.30 లక్షల ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని ఆదివారం మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యుడికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం అన్నారు.

ఎల్ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: మోతీనగర్‌కు చెందిన సుదర్శన్ బాబుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాధిత కుటుంబ సభ్యురాలికి ఆదివారం అందజేశారు.


హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్: హత్య కేసులో ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకులం జిల్లాకు చెందిన పడాల ఆనంద్, పడాల సుధాకర్ నగరంలో స్థిరపడి దూలపల్లిలో వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. దూలపల్లికి చెందిన శ్రీకాంత్‌గౌడ్‌కు చెందిన స్థలాన్ని తక్కువ ధరకు తనకు అమ్మాలని పడాల ఆనంద్ బెదిరింపులకు గురిచేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన శ్రీకాంత్ తన స్నేహితులు అలీ, రాజుతో కలిసి స్థలం విషయంలో పడాల ఆనంద్‌తో దూలపల్లిలోని ఓ కంటైనర్ సమీపంలో గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం దూలపల్లిలోని షెడ్డులో మరోసారి పడాల ఆనంద్, సుధాకర్‌తో మరోమారు గొడవకు దిగారు. ఆనంద్, సుధాకర్ ఇనుప రాడ్లతో శ్రీకాంత్‌గౌడ్, అలీపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో శ్రీకాంత్‌గౌడ్ మృతి చెందాడు. గాయపడిన అలీ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు పడాల ఆనంద్, సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

నేటినుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


మూసాపేటలోని కేపీఎం గ్రౌండ్‌లో మండపం


హస్మత్‌పేట చౌరస్తాలో ముస్తాబైన అమ్మవారి మండపం


జనతానగర్, చిత్తారమ్మ ఆలయం వద్ద మండపం

మూసాపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరిస్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు వస్తుంటారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు కాలనీల్లో మండపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు ఆలయాల వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మ సందర్భంగా భరత్‌నగర్ కాలనీ కూరగాయల మార్కెట్, కేపీహెచ్‌బీ కాలనీ రైతు బజార్‌లో పండ్లు, బంతి పూలు, చామంతి, గులాబీ పూల ధరలకు రెక్కలొచ్చాయి.

అమ్మవారి ఆలయాలు ముస్తాబు

ఓల్డ్ బోయిన్‌పల్లి: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఆలయాలు, మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్‌లోని దుర్గభవానీ మాత ఆలయం, హస్మత్‌పేట విజయదుర్గ దేవి ఆలయం, అంజయ్యనగర్ కనకదుర్గ దేవి, నల్లపోచమ్మ ఆలయంతో పాటు అంజయ్యనగర్, హస్మత్‌పేట చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ 6వ ఫేజులోని శ్రీవిజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం శ్రీబాలా త్రిపుర సుందరిదేవి, మంగళవారం మీనాక్షి దేవి, బుధవారం గాయత్రి దేవి, గురువారం అన్నపూర్ణాదేవి, శుక్రవారం మహాలక్ష్మీదేవి, శనివారం లలిత త్రిపుర సుందరీదేవి, ఆదివారం మహాచండీ దేవి, సోమవారం సరస్వతీ దేవి, మంగళవారం దుర్గాదేవి, బుధవారం మహిషాసురమర్దినీ దేవి, గురువారం రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం మహా పూర్ణాహుతి, అన్న సమారాధన, అమ్మవారి ఊరేగింపు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో గరికపాటి నరసింహారావు, మాడుగుల నాగఫణిశర్మ, శ్రీనివాస బంగారయ్యశర్మ ప్రవచనాలతో పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు






కూకట్‌పల్లి వెంకట్రావ్ నగర్ కాలనీలో..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, యువతులు బతుకమ్మలను ఒక వేదిక వద్దకు తీసుకువచ్చి బతుకమ్మ ఆడారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు ఆటా, పాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఫలహారాలను పంచుకున్నారు. – కూకట్‌పల్లి




కూకట్‌పల్లి స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లో..






శిల్పా బృందావనంలో..